క్లుప్తంగా

హాస్య నటచక్రవర్తి ఆకుల వెంకయ్యకు పుష్పాంజలి



తెనాలి: సుప్రసిద్ధ రంగస్థల కళాకారులు, హాస్య నట చక్రవర్తి ఆకుల వెంకయ్య చిరస్మరణీయులని పలువురు వక్తలు నివాళులర్పించారు. ఆకుల వెంకయ్య 39వ వర్ధంతి రోజైన బుధవారం స్థానిక నందులపేటలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. చింతామణి నాటకంలో శ్రీహరి పాత్రలో ఆకుల వెంకయ్య తనదైన డైలాగులతో హాస్యపు జల్లు కురిపించారని, రాష్ట్రవ్యాప్తంగా పది వేల ప్రదర్శనలతో కళారంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారని గుర్తుచేసుకున్నారు. రంగస్థల కళాకారుల సంఘం నాయకుడు గరికపాటి సుబ్బారావు, అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ, తన్నీరు శివశంకర్, లక్కరాజు లక్ష్మణరావు, పాతూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన



తెనాలిరూరల్: జూలై 20, 21 తేదీలలో తెలంగాణలో జరిగిన ఒకటో అంతర్జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్(తైక్వాండో) చాంపియన్‌షిప్‌లో స్థానిక చెంచుపేటలోని యూనిట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు 12 మంది పాల్గొన్నారు. వీరు ఏడు స్వర్ణ పతకాలు, రెండు రజిత, మూడు కాంస్య పతకాలు సాధించారని అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు నాగరాజు తెలిపారు. పతకాలు సాధించిన వారికి తెనాలి పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి అండె బాలచంద్రమౌళి పతకాలను ప్రశంసాపత్రాలను గురువారం అందజేశారు. ఆగస్టు నెల 10, 11 తేదీలలో చిత్తూరు జిల్లాలో జరిగే సౌత్ ఇండియా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో ఈ క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారులను తల్లిదండ్రులు, అకాడమీ గౌరవాధ్యక్షుడు సుంకర సురేష్, పలువురు పెద్దలు అభినందించారు.

మహనీయుల పేర్లు పెట్టడం ముదావహం



తెనాలిరూరల్: ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం అభినందనీయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని తన నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి అనంతాచార్యులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం సంతోషకరమన్నారు. విద్యా కానుకకు సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు, ప్రతిభా పురస్కారాలకు అబ్దుల్ కలాం పేరు పెట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, కటారి వాసుదేవ నాయుడితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు..

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడిలో వివాహిత ఆత్మహత్య ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పచ్చిపులుసు వెంకటమణి(40) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం వెంకటమణి భర్త మల్లికార్జునరావు యథావిధిగా వ్యాపార నిమిత్తం బయటకు వెళ్లగా మణి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. మణి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకాష్ నగర్‌లో డ్రెయిన్ పూడిక తీత



తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పలుచోట్ల కార్పొరేషన్ ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపట్టారు. వర్షాకాలంలో మురుగునీటి సమస్యను పరిష్కరించి దోమలు నివారించేందుకు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని కార్పొరేషన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో జెసిబీల ద్వారా ముందుగా ఔట్‌ఫాల్ డ్రైన్ పనులు చేపట్టారు. ప్రకాష్ నగర్‌లోని ప్రాంతాల్లో పూడిక తీత పనులు చేపట్టారు.

పన్నుల బలవంతపు వసూళ్లు సరికాదు



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక, సమాధానమిస్తున్న కమిషనర్ శేషన్న



హాజరైన సభ్యులు

- తెనాలి మున్సిపల్ కౌన్సిల్‌లో సభ్యుడి ప్రశ్న
- 37 అంశాలపై చర్చ
- సజావుగా సాగిన సమావేశం

తెనాలిరూరల్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సజావుగా సాగింది. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం కోసం అధికారులు 37 అంశాలతో కూడిన అజెండాను రూపొందించారు. సమావేశం ప్రారంభమవగా 25వ వార్డు సభ్యుడు తాడిబోయిన రామయ్య రక్షిత మంచి నీటి కుళాయిల గురించి ప్రస్తావించారు. ఖాళీ స్థలాలకూ కుళాయి కనెక్షన్‌లు ఇచ్చి పన్ను విధిస్తుండడం సరైంది కాదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. బలవంతంగా పన్ను వసూలు చేయడం సబబు కాదన్నారు. దీనికి కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ మున్సిపల్ బైలా ప్రకారం నడుచుకునే బాధ్యత తమపై ఉంటుందన్నారు. పురపాలక సంఘ కార్యాలయ భవనం శ్లాబ్ పెచ్చులూడుతోందని, వెంటనే మరమ్మతులు చేయించాల్సి ఉందని 15వ వార్డు సభ్యుడు గుంటూరు కోటేశ్వరరావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అత్యవసరంగా చేయాల్సిన పనులను పక్కన పెడుతున్నారని విమర్శించారు. పురపాలక సంఘ నిధులను పంచాయతీలకు వినియోగించారని, అలా వినియోగించే అధికారం ఉందా అని 19వ వార్డు సభ్యుడు పసుపులేటి త్రిమూర్తి కమిషనర్‌ను ప్రశ్నించగా అందుకు సంబంధించిన ఫైలును చైర్‌పర్సన్ ఎదుట ఉంచుతానని సమాధానమిచ్చారు. దీనికి తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ 2018లో టీడీపీ హయాంలోనే పురపాలక సంఘ నిధులను పంచాయతీలకు ఔటర్ రింగ్ రోడ్డు పేరిట ఖర్చు చేశారని గుర్తు చేశారు. తన వార్డులో ఐదంతస్తుల భవన సముదాయాన్ని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్మించారని, అవినీతి జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని ఆరో వార్డు సభ్యురాలు కొర్రపాటి లక్ష్మి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రెండో వార్డు సభ్యురాలు అన్నాబత్తుని పద్మజ ఫిబ్రవరి నుంచి కౌన్సిల్ సమావేశాలకు రావడంలేదని, మూడు నెలలు వరుసగా సమావేశాలకు రాకపోతే సభ్యత్వం రద్దు చేసే అవకాశం ఉందన్న 19వ అంశాన్ని వాయిదా వేస్తూ సమావేశం నిర్ణయం తీసుకుంది. అలానే కంపోస్టు యార్డులో బయోమైనింగ్ కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టరు పనులు సక్రమంగా చేయకపోతుండడంతో కాంట్రాక్టర్‌ను మార్చాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



ఐటీఐలో ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీల వద్ద రోటరీ క్లబ్ బాధ్యులు

తెనాలి: స్థానిక జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ)లో రోటరీ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచ్‌లను పీడీజీ అన్నే రత్న ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. క్లబ్ సభ్యుల సహకారంతో మొత్తం 21 బెంచీలను పెదరావూరు, నందివెలుగు, తేలప్రోలు, తెనాలిలోని యడ్ల లింగయ్య కాలనీ, నాజర్‌పేట, గోశాల, ఐటీఐలలో ఏర్పాటుచేశారు. ఇందుకోసం రూ.లక్ష వ్యయం చేసినట్టు క్లబ్ బాధ్యులు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్, తెనాలి ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ డైరెక్టర్లు గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్బు బోర్డు డైరెక్టర్ గుమ్మడి ప్రసాద్, ఐటీఐ ప్రిన్సిపాల్ మోహన్, ఇన్‌స్ట్రక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయంతో ఆర్థిక స్వావలంబన



చెక్కును అందజేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిరూరల్: ప్రభుత్వం అందించే రుణ సహాయంతో ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన పొందాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెనాలి మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలను పంపిణీ చేశారు. మొత్తం 38 గ్రూపులకు రూ.5.37 కోట్లకు చెక్కులను మనోహర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ద్వారా వచ్చే రుణాలను, ఆర్థిక సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీడీవో కాటూరి శిల్ప, ఏపీఎం జయశ్రీ పాల్గొన్నారు.

'ఫిన్‌టెక్' రాకతో అన్ని రంగాల్లో పెనుమార్పులు

ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యులు డాక్టర్ శ్రీనివాసన్



విద్యార్థినికి ఫిన్‌టెక్ సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: ఫిన్‌టెక్ టెక్నాలజీ రాకతో పెను మార్పులు వచ్చినట్లు ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) బోర్డు సభ్యుడు డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన ఫిన్‌టెక్ ఇన్నోవేషన్ లేబొరేటరీ ప్రారంభోత్సవానికి డాక్టర్ శ్రీనివాసన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక రంగానికే కాకుండా వినియోగదారుల నుంచి, ఆర్థిక సంస్థలతో పాటు కొత్తగా వ్యాపార రంగంలోకి ప్రవేశించే వారి నుంచి రెగ్యులేటర్ల వరకు కొత్త ఉద్యోగ అవకాశాలను, ప్రాజెక్టులను సృష్టిస్తోందని పేర్కొన్నారు. టెక్నాలజీతో ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. పోటాపోటీగా ఆర్థిక సేవలను ప్రజలకు సులువుగా అందించడంతో పాటు ప్రాముఖ్యతను విస్తృతం చేయడం ద్వారా, బీటెక్ పట్టభద్రులకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని అన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న సందర్భాన్ని గుర్తించి తమ వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులతో పాటు ఎంబీఏ విద్యార్థులకు ఫిన్‌టెక్‌ను మెర్జ్ చేసి సులభతరంగా వారికి పాఠ్యాంశాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఏడాదికి 500 మందికి పైగా తమ వర్సిటీకి చెందిన విద్యార్థులు ఫిన్‌టెక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అందించే వివిధ ఫిన్‌టెక్ కోర్సులలో ఇంటర్న్‌షిప్‌తో పాటు ఫిన్‌టెక్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రపంచ ఫిన్‌టెక్ కౌన్సిల్ యొక్క అత్యంత విశ్వసనీయమైన ప్రొఫెషనల్ సర్టిఫికెట్, బ్యాడ్ పొందారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రొ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్కిల్ డెవలప్‌మెంట్, స్టూడెంట్ ప్రోగ్రెషన్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎన్.బి.వి.ప్రసాద్, కె.ఎల్.టిఫ్. సీఈఓ హరిబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో మెరుగైన ర్యాంక్ సాధించడమే లక్ష్యం

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్– 2024లో గుంటూరు నగరపాలక సంస్థకు మెరుగైన ర్యాంక్ సాధించడానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ(ఎఫ్ఏసీ) మధుసూదన్‌రావు తెలిపారు. నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) ఎస్.హరికృష్ణ ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్– 2024లో తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య అధికారులు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్యాన్ని సాధించడానికి వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, అందుకు తగిన విధంగా వార్డు సచివాలయాల వారీగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గత ఏడాది కంటే మెరుగైన ర్యాంక్ సాధించడం తేలికవుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, ప్రతి కమర్షియల్ సంస్థ డస్ట్ బిన్‌ని ఏర్పాటు చేసుకునేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ మలేరియా చర్యలు చేపట్టడం, ఖాళీ స్థల యజమానులే తమ స్థలాలను శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, ఆనంద కుమార్, ఆయూబ్ ఖాన్, సోమ శేఖర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: ప్రభుత్వాలు మారుతున్న కార్మికులు, రైతుల సమస్యలు తీరడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రజలపై భారాలు మోపుతూ బడా కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రకటించిందని విమర్శించారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని దుయ్యబట్టారు. గుజరాత్ వ్యాపారస్తుల ప్రభుత్వమన్నారు. కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1,2,3 తేదీలలో విశాఖపట్నంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని 3వ తేదీ వేలాది మంది కార్మికులతో మహాప్రదర్శన, బహిరంగ సభ జరగబోతున్నదని గుంటూరు జిల్లా కార్మిక వర్గం ఈ ర్యాలీ, బహిరంగ సభలలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మహా ప్రదర్శన పోస్టర్లు ఆవిష్కరించారు.

నేడు మంత్రి పర్యటన

తెనాలిరూరల్: రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం నియోజకవర్గంలో పర్యటించనున్నట్టు మంత్రి కార్యాలయవర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం తొమ్మిది గంటలకు కొల్లిపర మండలం చక్రాయపాలెం, 9.30 గంటలకు జెముడుబాడు, 10 గంటలకు దావులూరు, 10.30 గంటలకు దంతలూరు, 11 గంటలకు తూములూరు, 12.15 గంటలకు కొల్లిపర, సాయంత్రం నాలుగు గంటలకు తెనాలి మండలం కొలకలూరు, 4.30 గంటలకు గుడివాడ, ఐదు గంటలకు కోపల్లె, 5.30 గంటలకు అంగలకుదురు గ్రామాల్లో పర్యటించి సామాజిక పింఛన్‌లను పంపిణీ చేస్తారని వివరించారు.

బంగారం గొలుసు చోరీ

కృష్ణలంక(విజయవాడ తూర్పు): నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారం గొలుసు గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని వెళ్లిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరుకు చెందిన గుంటుపల్లి వాణిశ్రీ బుధవారం ఉదయం కృష్ణలంకలోని ఐడియల్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లింది. సాయంత్రం 3.30 గంటల సమయంలో ఆమె షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆ సమయంలో సుమారు 20 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని యువకుడు స్కూటర్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న 50 గ్రాముల బంగారం చైన్‌ను లాక్కొని వెళ్లిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సస్పెన్షన్‌కు గురైన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గతం 11 నెలల కాలం నుంచి సస్పెన్షన్‌కు గురైన 12 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం విధుల్లోకి చేరిన నగర కమిషనర్ హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రెహమాన్, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, లక్ష్మీ నారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుమిత్రా దేవి, సహాధ్యక్షురాలు లీలాబాయి, రోజారాణి, నీలిమ పాల్గొన్నారు.

ఈమనిలో డీపీఓ పర్యటన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ పాఠశాలను దుగ్గిరాల మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని రికార్డులను, అటెండెన్స్ రిజిస్టార్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో తాగునీటి శాంపిల్స్‌ను ఈమని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ ద్వారా పరీక్షించారు. ఎంఈఓ కె.శ్రీనివాసరావు, దుగ్గిరాల మండల పంచాయతీ విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఎస్పీ సత్కారం

నగరంపాలెం: ఉద్యోగ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. ఎస్‌బీ డీఎస్పీ టి.రత్నస్వామి, ఏఎస్ఐలు వెంకటేశ్వర్లు (ఎస్‌బీ), టి.పెదబాబు (కంట్రోల్ రూమ్), షేక్ ఎండీ జానీ (మేడికొండూరు పీఎస్), కె.మోహనరావు (ఫిరంగిపురం పీఎస్), హెడ్ కానిస్టేబుల్ దేవరాజు (అరండల్‌పేట పీఎస్), హెచ్‌సీ రత్నరాజు (ఏఆర్), కానిస్టేబుల్ కమల్ బాషా (తుళ్లూరు ట్రాఫిక్ పీఎస్)లు బుధవారం ఉద్యోగ విరమణ పొందగా, జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రమ శిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారని, అందరూ ఒకే పోలీస్ కుటుంబమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, జిల్లా ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, ఆర్ఐ హరిరెడ్డి, గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్ , మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో అసోసియేషన్ నేతలు

తెనాలి: ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రవాణా, క్రీడా, యువజన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించినట్టు వెల్లడించారు. ఆర్టీసీలో 7,300 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పని పనిచేస్తున్నారని ఏపీఎస్ ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సుధీర్ కుమార్ తెలిపారు. ఈ విధానం వల్ల చాలా నష్టపోతున్నందున, ఆర్టీసీలో థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌లో ఆర్టీసీని కలపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కాంప్లిమెంట్ బస్సు పాస్‌ను 100 కిలోమీటర్ల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ అనేది ఆర్టీసీ ద్వారా కట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కారం చేస్తారని హామీనిచ్చినట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్, రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రటరీ గంగాంజనేయులు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహివర్మ, రాష్ట్ర వర్కింగ్ సెక్రటరీ అశోక్, 26 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నట్టు వివరించారు.

దోమల నివారణకు ప్రజలు సహకరించాలి

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



ర్యాలీలో అధికారులు సిబ్బంది

తెనాలిరూరల్: డెంగీ నివారణ మాసోత్సవం ముగింపు సందర్భంగా తెనాలి చినరావూరు తోట నుంచి మలేరియా అధికారులు, పాల్‌రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం, తెనాలి పట్టణ స్పెషల్ ఆఫీసర్ అంగలకుదురు గాయత్రీ దేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దోమల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. చేయి చేయి కలుపుదాం.. డెంగీ నివారిద్దాం అన్న నినాదంతో ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రజలకు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి, గుంటూరు సబ్ యూనిట్ అధికారి సూద శివ గణేష్, ఆరోగ్య విస్తరణ అధికారి అండె బాలచంద్రమౌళి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పానుగంటి రాధిక, మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, దాసరి నాగ మల్లేశ్వరరావు, తిరువీధుల శివ రామ ప్రసాద్, బండారు మల్లేశ్వరరావు, టీబీ సూపర్వైజర్ రవి కుమార్, హెల్త్ అసిస్టెంట్స్ షేక్ నవీద్, షేక్ రషీద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి



జేసీ భార్గవ్ తేజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

గుంటూరు వెస్ట్: జిల్లాలోని రేషన్ డీలర్ల కనీస సమస్యలను పరిష్కరించాలని చౌకదుకాణాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైఏబీ ప్రసాదరావు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజకు వినతిపత్రం అందజేశారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జేసీని అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఐసీడీఎస్, ఎండీఎం బకాయిలు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. రెండు నెలల నుంచి బియ్యంపై రావాల్సిన కమీషన్లు ఎస్‌సీఎం ఖాతాలో జమచేస్తున్నారని, దీనివల్ల డీలర్లు ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కమీషన్‌ను డీలర్ల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అసోసియేషన్ నాయకులు దాసరి శ్రీనివాసరావు, వంగపాటి అంజయ్య, కె.విద్యాసాగర్, పి.సాయి హనుమంతరావు, కిషోర్ పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణమైన పోషకాహారమని, బిడ్డ పుట్టిన గంటలోపలే తల్లిపాలు పట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం సెమినార్ హాలులో ఆస్టర్ రమేష్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కాన్పు సమయంలో ఉత్పత్తి అయ్యే కొలెస్ట్రమ్ వలన వ్యాధినిరోధక శక్తి వస్తుందన్నారు. తల్లిపాల వల్ల బిడ్డకు తేలికగా జీర్ణం అవడం, వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన గైనకాలజిస్ట్ ఎస్.అనిత, డాక్టర్ సాహితీ, డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మమత పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే కొత్త కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న కొత్త కార్యవర్గం

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ తెనాలి నియోజకవర్గ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొని కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడిగా చందు సుబ్బారావు, కార్యదర్శిగా మేలేటి గోపిచంద్, గౌరవ అధ్యక్షుడిగా బొల్లిముంత కృష్ణ, ఉపాధ్యక్షులుగా శ్యామల ప్రసాదరెడ్డి, తాడిగిరి శరత్ బాబు, కోశాధికారిగా దీపాల తారక సాయినాథ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సిద్దుల సాయినాథ్, సహాయ కార్యదర్శులుగా కంకిపాటి రమేష్ కుమార్, బత్తుల కమలాకర్, తన్నీరు కళ్యాణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎం. వెంకటేశ్వరరావు, కొరప్రాటి సురేష్, ఆర్‌వి కిరణ్ కుమార్, షేక్ అబ్దుల్ హకీం జానీ, గళ్లా కృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన, జిల్లా అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్లగూర భక్తవత్సల నాయుడు, ఎల్రక్టానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు యేచూరి శివ, జిల్లా అధ్యక్షుడు సునీల్ సందీప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులతోపాటు ఐజేయూ సభ్యుడు మార్కండేయులు సహా కొద్ది నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో జిల్లా కమిటీలో వివిధ పదవులు పొందిన వారిని సత్కరించారు. కార్యక్రమానికి కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, నెహ్రూనికేతన్ విద్యాసంస్థల డైరెక్టర్ మురళి కాంత్ దాసరి, తెనాలి డబుల్ హార్స్ అధినేత మునగాల మోహన శ్యాం ప్రసాద్, వైష్ణవి కాలేజ్ కరస్పాండెంట్ పాటిబండ్ల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు, రోటేరియన్ ఈదర పూర్ణచంద్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మొవ్వ సత్యనారాయణ, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ జె.కోటినాగయ్య, చింతల శ్రీనివాసరావు, మైత్రి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. కరోనా సమయంలో జర్నలిస్టులకు అండగా నిలిచిన వీరిని కొత్త కార్యవర్గం సత్కరించింది.